క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా జి. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న మహ్మద్ యూసుఫ్‌కు బదిలీ ఆదేశాలు రాకపోవడంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(ఎంఏ) డిపార్ట్‌మెంటు కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గ్రేడ్–2 మున్సిపాలిటీలో జాయింట్ కమిషనర్‌గా పని చేస్తున్న జి. శ్రీనివాస్ గ్రేడ్–1 మిర్యాలగూడ మున్సిపాలిటీకి బదిలీపై వచ్చారు. ముందుగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్, లోకల్‌బాడీస్ జిల్లా అదనపు కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ నారాయణ్ అమిత్‌ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరి, టీఎంసీ బక్కయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణతో పాటు ఉద్యోగ సిబ్బంది ఉన్నారు.

స్పాట్ అడ్మిషన్ల గడువు పెంపు

నాగార్జునసాగర్ : స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాల(పురుషులు)లో డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 30తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. మాధవిలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు, ఉచిత వసతి, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ఆటలలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఫిజికల్ డైరెక్టర్‌తో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ మెమోలు, టీసీ, కులం, ఆదాయం, స్టడీ కండక్ట్‌తో రావాలని కోరారు. ఇతర వివరాలకు 9640811664,9642046006 ను సంప్రదించాలని తెలిపారు.

ఎస్ఐ సాయి ప్రశాంత్‌కు సన్మానం



ఎస్ఐని శాలువాతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హాలియా : హాలియా పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా భాద్యతుల చేపట్టిన సాయి ప్రశాంత్‌ను శుక్రవారం అనుముల మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, హాలియా మున్సిపాలిటీ పట్టణ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌రెడ్డి, దోరపల్లి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నాయకులు సురభి రాంబాబు, చేగొండి కృష్ణ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, రామలింగం, సైదాచారి, ఎల్లయ్య ఉన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సైదయ్య నాయుడు

నిడమనూరు : మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి సైదయ్య నాయుడు ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంఘం సంక్షేమానికి కొన్నేళ్లుగా ఎంతోగానో కృషిచేస్తున్నారు. ఆయన వెనిగండ్ల సహకార సంఘం చైర్మన్‌గా హాలియా జెడ్పీటీసీగా లక్ష్మి సైదయ్యానాయుడు పనిచేశారు దయ్యానాయుడి ఎన్నికపై స్థానిక నాయకులు సంకూరి రాంబాబు, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, నిడమనూరు మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మెరుగు మధు హర్షం వ్యక్తం చేశారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించాలి



వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్ : రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ డీవైఎఫ్ఐ కార్యదర్శి మల్లం మహేష్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఓ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీన రాజీవ్ యువ వికాసం పథకానికి నిధులు విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. నేటికీ నిధులను కేటాయించలేదన్నారు. నిధులను వెంటనే విడుదల చేసి నిరుద్యోగులకు రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, కట్ట లింగస్వామి, ఎండీ అక్రమ్, మహేష్, పాలాది కార్తీక్, అంజి, గోపికృష్ణ పాల్గొన్నారు.

అధ్వానంగా సుందరయ్య పార్కు



నిరుపయోగంగా నాగార్జునసాగర్ డ్యామ్ నమూనా ఫౌంటెన్



పిచ్చిమొక్కలతో నిండిపోయిన పార్కు ఆవరణ

- కానరాని పచ్చదనం
- దర్శనమిస్తున్న పిచ్చి మొక్కలు
- విరిగిన ఓపెన్ జిమ్ పరికరాలు

మిర్యాలగూడ అర్బన్ : రోజంతా వివిధ పనులతో బీజీగా ఉండే ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో కాసింత సేద తీరాలని మిర్యాలగూడ పట్టణంలోని సుందరయ్య పార్కు వస్తుంటారు. కానీ ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. పార్కు నిర్వహణ సక్రమంగా లేక పార్కు ఆనవాలను కోల్పోతుంది. పార్కులో ఏర్పాటు చేసిన నాగార్జున సాగర్‌డ్యామ్ నమూనా వాటర్ ఫాల్స్ నిరుపయోగంగా మారింది. గతంలో సాయంత్రం వేళల్లో రంగురంగుల వెలుగుల్లో జిగేల్‌మంటు నీటిసవ్వడితో అలరించిన నమూనా డ్యామ్ పని చేయడం లేదు. అందులో నీటిని నింపి మోటారు ఏర్పాటు చేయకపోవడంతో అందులో చెత్తాచెదారం నిండి.. ఇటీవల కురిన వర్షాపు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది.

పిచ్చిమొక్కలతో..

పార్క్‌లో పూల మొక్కలతో అహ్లాదం పంచవలసిన పార్కు పిచ్చి మొక్కలు, కంపచెట్లతో దర్శనమిస్తుంది. దీంతో పార్క్‌కు వాకింగ్‌కోసం వచ్చే వారికి ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు పార్క్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లో పరికరాలు విరిగిపోయి ఉండటంతో వ్యాయామం చేసేందుకు వీలు లేకుండా ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. పార్కు నిర్వహణను మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. పార్కులో ఎక్కడ చూసినా ఖాళీ వాటర్ బాటిళ్లు, తాగి పడేసిన బీరు బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో పార్క్‌ను శుభ్రం చేయడంలేదని తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సుందరయ్య పార్కును పట్టించుకుని పార్కులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



విరిగిన ఓపెన్‌జిమ్ పరికరాలు



మొక్కలు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుండీలు

ఆహ్లాదంగా మార్చాలి



సుందరయ్య పార్కు నిర్వహణ అధ్వానంగిఆ ఉంది. పార్కులో అన్ని సమస్యలే.. పార్కులో పరిచిన గడ్డి ఎండిపోయింది. నీటి ఫౌంటేన్లు పని చేయడం లేదు. మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. మొక్కలు సైతం ఎండిపోయి కనిపిస్తున్నాయి. చిన్నపిల్లలు ఆడుకునే వస్తువులు, ఓపెన్‌జిమ్‌లో పరికరాలు అన్నీ విరిగిపోయి ఉన్నాయి. అధికారులు స్పందించి పార్క్‌ను ఆహ్లాదకరంగా మార్చాలి.

– కృష్ణ, మిర్యాలగూడ

రుణాలు సకాలంలో చెల్లించాలి



ఇంటికి వెళ్లి రుణాలు రికవరీ చేస్తున్న ఏపీఎం భాషపాక చంద్రశేఖర్

మాడుగులపల్లి : మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని ఏపీఎం భాషపాక చంద్రశేఖర్ అన్నారు. డీఆర్‌డీఓ అధికారుల ఆదేశాల మేరకు లోన్ రికవరీ డ్రైవ్‌ను శుక్రవారం మండలంలోని మాచనపల్లి, గోపాలపురం గ్రామాల్లో సంఘాలతో సమావేశం నిర్వహించి స్త్రీనిధి ఓవర్ డ్యూ బకాయి పడిన మహిళా సంఘాల సభ్యుల ఇంటింటికి తిరిగి రికవరీ చేశారు. మాచనపల్లి గ్రామంలో రూ.1,94,600, గోపాలపురం గ్రామంలో రూ.2,44,313 రికవరి చేసి మాట్లాడారు. స్త్రీ నిధి బ్యాంక్ రుణాలను ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లించాలని, ప్రతి సంఘ సభ్యురాలు స్త్రీ నిధి రుణాలను గ్రామాల్లో పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ స్వాగత్‌రావు, నాగయ్య, సీఏ సైదులు, ఉమామహేశ్వరి, వీఓఏ అరుణ, మహేందర్, పార్వతమ్మ పాల్గొన్నారు.

బీజేపీకి 'స్థానిక' ఎన్నికలు నిర్వహించమనే హక్కు లేదు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని అడిగే హక్కు బీజేపీకి లేదని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై 14న తెలంగాణ వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఆయన వెంట మురళియాదవ్ తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్



మిర్యాలగూడ : వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు



త్రిపురారంలో..

మిర్యాలగూడ : గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం హైదరాబాద్ కమిషనర్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న సీఐటీయూ నాయకులను, గ్రామ పంచాయతీ సిబ్బందిని వాడపల్లి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బైరం దయానంద్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలన వెంటనే చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో సుందరమ్మ, ప్రేమమ్మ, శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

త్రిపురారం : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర కమిషన్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్న పోలె సాంబయ్యను త్రిపురారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలె సాంబయ్య పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో సాంబయ్య మాట్లాడుతూ.. కార్మికుల పక్షన పోరాడుతున్న వారిని అరెస్టులతో ప్రభుత్వం భయాలకు గురి చేస్తుందని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి వెనుకడుగు వేసేదిలేదన్నారు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్మికులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దొండవారిగూడెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నందున శుక్రవారం పాఠశాలలో ఆయా పార్టీల నాయకులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందడంతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎలకని రమణ, కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, గ్రామ పెద్దలు వీరమల్ల చిన్నఅంజయ్య, పోతురాజు నాగయ్య, కూర అంజయ్య, వీరమల్ల సైదులు, యుటీఎఫ్ నాయకులు అంజయ్య, హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

విద్యుదాఘాతంతో ఆవు మృతి



కంపాసాగర్‌లో మృతి చెందిన ఆవు వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

త్రిపురారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ సంఘటన త్రిపురారం మండలంలోని కంపాసాగర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంపాసాగర్ గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు వ్యవసాయంతో పాటుగా గేదెలు, ఆవులను సాకుతున్నారు. గ్రామంలో పొలాలు ఖాళీగా ఉండడంతో రోజు మాదిరిగానే ఆవులను మేత కోసం సమీపంలో ఉన్న పొలాలకు తోలారు. అయితే ఆవు ఇంటికి రాకపోవడంతో వెతుకుతున్న సమయంలో గ్రామంలో వీధి దీపాలు, ఇళ్ల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసుకున్న సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫారం వద్ద మృతిచెందింది. ఆ స్తంభం వద్ద ఎర్త్ వైరు కిందకు ఉండడంతో విద్యుత్ సరఫరా అయ్యి విద్యుత్తాఘాతానికి గురై అక్కడికక్కడే ఆవు మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ పోషణ కోసం సాకుతున్న ఆవు మృతి చెందిందని, ఆవు విలువ సుమారు రూ. 85 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

అంగన్‌వాడీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : గర్భిణులు తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇస్లాంపుర సెక్టార్ పరిధిలోని సుభాష్‌నగర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమాంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మమత మాట్లాడుతూ ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటే డెలవరీ అయ్యే వరకు గర్భిణులు 12కిలోల బరువును పెరగాలన్నారు. ఐరన్ టాబ్లెట్లు వేసుకుంటూ హిమోగ్లోబిన్ 12శాతం ఉండేలా చూసుకోవాలని, నార్మల్ డెలవరీ అయ్యే విధంగా తయారు అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగమణి, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ టి. కవిత, అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్ నర్మద, ఎ. చిన్నమ్మ, పి. లత, ఆశా వర్కర్ అనితతో పపాటు గర్భిణులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



సామూహిక సీమంత కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ రేఖల మమత, అంగన్‌వాడీ టీచర్లు

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

వేములపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిరుమళ్ల గోపి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌ను సందర్శించి మరుగుదొడ్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థి సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. పాఠశాలలో మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరి శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కట్ట విక్రమ్, శ్రీధర్, అజయ్ ఉన్నారు.

'ఫీజు' బకాయిలు విడుదల చేయాలి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, నోముల శంకర్‌యాదవ్, మైనం యుగందర్, లింగస్వామి తదితరులు ఉన్నారు.

నారాయణ స్కూల్‌లో బుక్స్ విక్రయ గది సీజ్



పుస్తకాల గదికి తాళం వేసి సీజ్ చేస్తున్న ఎంఈఓ బాలు నాయక్

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నారాయణ పాఠశాలలో బుక్స్, యూనిఫాం, బెల్ట్‌లు విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం స్కూల్‌ను ముట్టడించారు. ఎంఈఓ బాలు నాయక్‌కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి ఆయన చేరుకొని స్కూల్‌లో నిల్వ ఉంచి నోటుబుక్స్‌తో పాటు వివిధ సామగ్రి నిల్వ ఉంచి గదికి తాళం వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అద్యక్షులు ముడావత్ జగన్ నాయక్ మాట్లాడుతూ.. పట్టణంలో నారాయణ పాఠశాల యాజమాన్యం అధిక ఫీజుల రూపంలో దోపడీకి గురిచేస్తుందని ఆరోపించారు. బుక్స్, నోట్‌బుక్స్, బెల్ట్, టై, ఇలా అన్ని రకాల వస్తువులను విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు విద్యా హక్కు చట్టం అమలు చేయాలని చెబుతున్నా.. పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చి దోపిడీకి గురిచేస్తున్నా.. విద్యాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరన్న, బన్నీ, మోహన్, సాయి, చరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి



మిర్యాలగూడ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి చేస్తున్న లబ్ధిదారులు



తిరుమలగిరి(నాగార్జునసాగర్)లో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఆ పార్టీ మండల నాయకులు కొర్ర బీమ్లా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని యల్లాపురంతండాలో 20మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించి మాట్లా డారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తే వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్, హౌజింగ్ ఆఫీసర్ గోపి, ఆ పార్టీ నాయకులు కొర్ర విజయ్, కొర్ర శంకర్ నాయక్, నాగ, హనుమంతు, లక్ష్మణ్, శంకర్, సైదా, రాజా, పరంగాన్, బుజ్జి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

చందంపేట : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని మాజీ ఎంపీపీ బిక్కునాయక్ అన్నారు. శుక్రవారం నేరెడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లిలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు చేపట్టిన ఇంటి నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వినోద్, రమేష్‌నాయక్, బాబురం, శివశంకర్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

మిర్యాలగూడ : మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం లబ్ధిదారులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడతూ పేదల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి, వంగాల కృష్ణారెడ్డి, తిప్పన రాంరెడ్డి, తిప్పన రవీందర్‌రెడ్డి, జెట్టి చంద్రయ్య, మంద సైదులు, హౌసింగ్‌ఏఈ యమున, గ్రామ కార్యదర్శి రేవతి, పోలె రవి, మట్టయ్య, కూరాలకు నాగరాజు, సత్యం, రామాంజి వినయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కొండమల్లేపల్లి : మండలంలో విద్యాశాఖ అనుమతి లేకుండా అక్రమంగా కొనసాగుతన్న ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మహ్మద్ సొబాన్ అన్నారు. దేవరకొండలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతిలేని పాఠశాలలో పిల్లలను చేర్పించడం ద్వారా భవిష్యత్‌లో తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని విద్యా నాణ్యత కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, అశోక్, లక్ష్మణ్, త్రిశాంక్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

కృష్ణారావుకు దళితరత్న అవార్డు



దళితరత్న అవార్డు అందుకుంటున్న కృష్ణారావు

పెద్దవూర : మండల కేంద్రంలోని జాతీయ నాయకుల విగ్రహాల కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు దళితరత్న అవార్డుకు ఎంపికయ్యాడు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సాంస్కృతిక కార్యక్రమాల చైర్మన్ ఇటుక రాజు ఈ అవార్డు అందజేశారు. దళితరత్న అవార్డు రావడంపై ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బొంగరాల వెంకటేశ్వర్లు, కుక్కముడి ముత్యాలు, మాదిగ జేఏసీ యూత్ అధ్యక్షుడు కలకొండ పరమేష్, నాయకులు బొనిగె విద్యాసాగర్, మోహన్‌రావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



జేసీబీ సాయంతో రోడ్లను వెడల్పు చేయిస్తున్న ఎస్ఐ



కూరగాయల దుకాణాలను వెనక్కి జరపాలని వ్యాపారులను కోరుతున్న ఎస్ఐ

- కొండమల్లేపల్లి కూడలి వెడల్పు
- రోడ్ల మధ్యలో బుల్లోడ్స్ ఏర్పాటు
- ట్రాఫిక్ రద్దీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి : పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి కావడంతో రద్దీ ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా కొండమల్లేపల్లి పట్టణం మీదుగా కోదాడ నుంచి జడ్చర్ల వరకు 167 జాతీయరహదారి హైదరాబాద్ నుంచి నాగర్జున్‌సాగర్ రాష్ట్ర రహదారి వెళ్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడి కొంతమంది తమ ప్రాణాలను కోల్పోగా మరికొంతమంది క్షతగాత్రులయ్యారు.అంతేగాక పట్టణ కేంద్రంలో ప్రతి ఆదివారం జిల్లాలోనే అతిపెద్ద పశువుల, మేకలు, గొర్రెల సంతవల్ల కూడా రద్దీ ఎక్కువవ్వడంతో ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పొచ్చు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని స్థానిక పోలీస్ అధికారి, మండల అభివృద్ధి అధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి ట్రాఫిక్ నియంత్రణకు, ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో ప్రయాణికులకు, వాహనదారులకు కొంత ఉపశమనం కలిగిందని చెప్పొచ్చు.

అధికారులు చేపట్టిన ప్రత్యేక చర్యలు

- పట్టణ కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారం చేసే చిరు వ్యాపారుల కూరగాయల దుకాణాలను వెనక్కి జరపడ
- దుకాణాల ముందు చిరు వ్యాపారులు బండ్లు పెట్టకుండా గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీ
- రోడ్ల మధ్యలో ద్విచక్ర వాహనాలు నిల్పకుండా బుల్లోడ్స్‌ను ఏర్పాటు.
- జేసీబీ సాయంతో నాలుగు రోడ్ల కూడలిలో రోడ్ల వెడల్పు
- వ్యాపారులకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు తమ కర్తవ్యాన్ని గుర్తు చేయడం వంటి చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేసినట్లు చెప్పొచ్చు.

బాధ్యతగా వ్యవహరించాలి

నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లి పట్టణ చౌరస్తాలో ప్రమాదాల నివారణకు మరియు ట్రాఫిక్ నియంత్రణకు మండల అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శి సహకారంతో ప్రత్యేకంగా చర్యలు చేపట్టాం. ముఖ్యంగా వ్యాపారస్తులకు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించడంతో రోడ్లను విశాలం చేయించడం సులభమైంది. అంతేగాక ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత కాబట్టి ఈ విషయం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

– అజ్మీరా రమేష్, ఎస్‌హెచ్‌ఓ కొండమల్లేపల్లి